క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత యోగా తరగతులు

హుడాకాంప్లెక్స్: సంపూర్ణ ఆరోగ్యం కోసం సిద్ధ సమాధి యోగా ఎంతో ఉపయోగపడుతుందని యోగా గురూజీ సద్గునాచారి అన్నారు. ఆదివారం నుంచి దిల్‌సుఖ్‌నగర్‌లోని భవాని మహిళా మండలి భవనంలో ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, తలనొప్పి, అధిక బరువు తగ్గడానికి యోగా సంజీవనిలా పనిచేస్తుందని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు. గత 25 ఏళ్లుగా వేలాది మందికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఉచిత యోగా శిక్షణలో పాల్గొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ శిక్షణలో ఆసనాలు, ప్రణాయామం, సూర్య నమస్కారాలు, మెడిటేషన్, ఆహారపు అలవాట్లు నేర్పిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు 9393357033 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆస్తిపన్ను చెల్లించండి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: మున్సిపాలిటీ ప్రజలు ఇంటి, వాణిజ్య, వ్యాపార సముదాయాల ఆస్తిపన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఆస్తిపన్ను చెల్లించాలని అవగాహన కల్పిస్తున్నామన్నారు. మార్చి 31వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ విధిగా చెల్లించి, మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఉత్సాహంగా స్నాతకోత్సవం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేసిన ఉపాధ్యాయులు

మీర్‌పేట: మీర్‌పేట నారాయణ ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం ఈ-కిడ్స్, ఈ-ఛాంప్స్ విద్యార్థుల స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపాల్ బాబ్జీ పీపీ-11, 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో హెడ్స్ మహేశ్వరి, మీనా, కో ఆర్డినేటర్స్ వాణి, స్వప్న, ప్రిన్సిపాల్ ధరణి, వైస్ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, డీన్ రాజేందర్, ఏఓ మాధవి పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న స్వామివారు

తుక్కుగూడ : జిన్నాయిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం అభిషేకం, ప్రత్యేకలంకరణ పూజలు చేశారు. స్వామివారికి ఇష్టమైన రోజు శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు మురళీశర్మ, అజయ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

చల్లాకు ఘన సన్మానం



చల్లాను సన్మానిస్తున్న అల్మాస్‌గూడ నాయకులు

బడంగ్‌పేట్: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ సప్పిడి సుభాన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బంగారు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏపీఆర్‌ఆర్ గార్డెన్‌లో భారీ గజమాలతో సత్కారించారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మీర్‌పేట్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ చల్లా కవిత బాల్‌రెడ్డి, కార్పొరేటర్ మానిక శ్రీశైలం, కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ డైరెక్టర్ వెంకటేశ్‌గౌడ్, మాజీ వార్డు మెంబర్ యాదిరెడ్డి, మల్లారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజుయాదవ్, భిక్షపతిరెడ్డి పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్రాంతి తదితరులు



కొత్తపేట చౌరస్తాలో ..

హుడాకాంప్లెక్స్: నవతరానికి విప్లవ వీరుడు భగత్‌సింగ్ స్ఫూర్తి అని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి అన్నారు. శనివారం భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా సరూర్‌నగర్ చెరువు కట్టపై భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ.. బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాంచి స్వాతంత్ర్య సంగ్రామంలో యువతకు భగత్‌సింగ్ స్ఫూర్తిగా నిలిచారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎస్.మహేశ్, భాస్కర్, మల్లేశ్, విజయ్, నవీన్, ఆకాశ్, ఈశ్వర్, శివ, చింటు, నాని, చందు, మహేష్ పాల్గొన్నారు.

కొత్తపేట చౌరస్తాలో..

తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య చౌరస్తాలో వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.జంగయ్య ముదిరాజ్, నాయకులు అజయ్‌కుమార్, శ్రీను, ఎస్.రవికుమార్, ఎండి.ఇస్మాయిల్, దండు నిరంజన్, డేరంగుల యాదయ్య పాల్గొన్నారు.

మహేశ్వరంలో..

మహేశ్వరం: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం శనివారం బీజేవైఎం మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు నాగార్జున ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కాలనీలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్‌ను స్మరించుకున్నారు. కార్యక్రమంలో కోటి విద్య పాఠశాల చైర్మన్ దామోదర్ సచిన్ సోని,



శ్రీరాంకాలనీలో..

మాజీ సైనికుడు కాట్రగడ్డ వాసుబాబు, బీజేపీ నాయకులు హరికృష్ణ, సాయికుమార్, నవీన్‌గౌడ్, భరత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్‌ను తొలగించండి

ఇరిగేషన్ జిల్లా ఎస్‌ఈ హైదర్‌ఖాన్

తుక్కుగూడ : శ్రీనగర్ రెవెన్యూ పరిధిలోని మంఖాల్ వాగులో రియాల్టర్లు నిర్మించిన రిటైనింగ్ వాల్‌ను తొలగించాలని ఇరిగేషన్ జిల్లా ఎస్‌ఈ హైదరాఖాన్ ఆదేశించారు. ఈ నెల 21న సాక్షి దినపత్రికలో ప్రచురించిన ‘బఫర్ జోన్‌లో నిర్మాణాలు’ అనే కథనానికి ఇరిగేషన్ జిల్లా అధికారులు స్పందించారు. శనివారం మంఖాల్ వాగులో నిర్మించిన రిటైనింగ్ వాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రియాల్టర్లు మంఖాల్ వాగు బఫర్ జోన్ పరిధిలోని 8 నుంచి 9 మీటర్ల దూరం వచ్చి రిటైనింగ్ వాల్ అక్రమంగా నిర్మించారన్నారు. పనులు నిలిపివేయడంతో పాటు, దానిని తొలగించాలని నోటీసులు జారీ చేశామని తెలిపారు. వారం రోజుల్లో రిటైనింగ్ వాల్‌ను తొలగించకపోతే తమశాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా చెరువు, శిఖం భూములు, వాగులను కబ్జా చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఈఈ బన్సీలాల్, డీఈఈ దూద్యానాయక్, ఏఈ గోవింద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వాగులోని కట్టడాలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ప్రీతంకు అభినందనలు

మహేశ్వరం: నూతనంగా నియమితులైన రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను మహేశ్వరం కాంగ్రెస్ నాయకులు శనివారం గాంధీ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని ప్రీతం అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ఎస్సీలకు అందేలా కృషి చేస్తానని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు అందించి ఆర్థికాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయనను కలిసిన వారిలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు వత్తుల నారాయణ, మాజీ జెడ్పీటీసీ యాచారం జంగయ్య పలువురు పాల్గొన్నారు.



ప్రీతంను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మేయర్ ఎం.దుర్గ



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ ఎం.దుర్గ

మీర్‌పేట: వేసవి దృష్ట్యా కార్పొరేషన్‌లో నీటి సరఫరాలో అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మీర్‌పేట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ అధికారులకు సూచించారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జలమండలి అధికారులు, వాటర్‌మెన్‌లతో మేయర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి సరఫరాకు సంబంధించి కార్పొరేషన్‌లో ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని, కాలనీలు, బస్తీల్లో ప్రజలకు సరిపడా నీటిని అందించాలని ఆదేశించారు. తమ పరిధిలో సరఫరాలో సమస్యలు తలెత్తితే వాటర్‌మెన్‌లు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, డీఈ వెంకన్న, ఏఈలు శ్రీనివాసులు, మహిపాల్, జలమండలి ఏ ఈ వివేక్, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

మహేశ్వరం: తుమ్మలూరు గేటు (శ్రీశైలం జాతీయ రహదారి) నుంచి మహేశ్వరం వయా తుమ్మలూరు వరకు అసంపూర్తిగా ఉన్న బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని శనివారం ఆయన నివాసంలో తుమ్మలూరు గ్రామ యువకులు కలిశారు. తుమ్మలూరు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు గత ప్రభుత్వం రూ. 14.20 కోట్ల నిధులతో ప్రారంభించారు. రోడ్డుపైన మట్టి, కంకర పరిచి అసంపూర్తిగా వదిలేయడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రోడ్డు ఎత్తుగా పెంచి మట్టి పోశారన్నారు. నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి వాడుకలోనికి తీసుకురావాలని మంత్రిని యువకులు కోరారు. మంత్రి స్పందించి సంబంధిత అధికారులను త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంపై చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు త్వరగా ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో తుమ్మలూరు గ్రామ యువకులు పాల్గొన్నారు.



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన యువకులు



చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

పేదల ఇళ్లను రెగ్యులరైజ్ చేయాలని వినతి

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపురం డివిజన్ పరిధి ఎన్టీఆర్‌నగర్‌లోని పేదల ఇళ్లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ది అర్బన్ హట్స్, స్లమ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ట్విన్ సిటీస్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇస్మాయిల్, ఇతర బస్తీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడుతూ, ఎన్టీఆర్‌నగర్‌లో గత 42 ఏళ్లుగా పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఎన్నో ప్రభుత్వాలు మారినప్పటికీ బస్తీలోని సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల క్రమబద్ధీకరణను చేయాలని కోరారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైన ఈ సమస్యను పరిష్కరించాలని పేదలు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బస్తీ వాసులు కొరిమోని మధు మహారాజ్, పదిరే శంకర్, తెల్కర్ పోసన్న తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీజ్



స్వాధీనం చేసుకున్న మద్యం

మహేశ్వరం: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను మహేశ్వరం ఎస్‌టీటీ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం .. రావిర్యాల గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ కారులో మద్యం తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. మేరకు ఎస్‌ఓటీ ఎస్ఐ రాజు బృందం తుక్కుగూడలో కారును ఆపి తనిఖీలు నిర్వహించారు. రూ.46 వేల విలువైన 80.096 లీటర్ల క్వార్టర్ బాటిళ్లు, బీర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆపదలో అండగా..

షాబాద్: మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లీ మహేశ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామానికి చెందిన అమీర్‌గూడెం ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న నిరుపేదలకు ఎప్పుడు అండగా ఉంటామన్నారు. ఇప్పటి వరకు 15 కుటుంబాలకు ఆర్థికసాయం చేశారన్నారు. ఈ సందర్భంగా మల్లీ మహేశ్‌ను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు జంగయ్య, రమేశ్, ఎల్లేశ్, విఠల్, సుమన్, రఘు, శివరాజ్, సుందర్ తదితరులున్నారు.

ఏఓ మధుసూదన్ సస్పెన్షన్

కొందుర్గు: మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌ను సస్పెన్షన్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రైతుబంధు, రైతు బీమా నిధులు రూ.2.30కోట్ల అవినీతికి పాల్పడిన సంఘటనలో ఏఈఓ శ్రీశైలంను ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. అయితే, శనివారం కొందుర్గు మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌ను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. షాద్‌నగర్ వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజారత్నం సస్పెన్షన్ ఉత్తర్వులను మధుసూదన్‌కు అందజేశారు.

హెచ్‌పీ గ్యాస్ షాపీ పాయింట్ ఏర్పాటు

షాబాద్: గ్యాస్ వినియోగదారుల సౌకర్యార్థం మండలంలో అందుబాటులో ఉండే విధంగా హెచ్‌పీ గ్యాస్ ఏఆర్‌బీ షాపీ పాయింట్‌ను ఏర్పాటు చేసినట్లు హెచ్‌పీ గ్యాస్ జిల్లా సేల్స్ అధికారి కోమల శివకృష్ణ అన్నారు. మండలంలోని హైతాబాద్ గ్రామంలో శనివారం ఈ గ్యాస్ షాపీ పాయింట్ కేంద్రాన్ని ఆయన షాద్‌నగర్‌లోని గురుకృప గ్యాస్ ఏజెన్సీ సర్వీస్ డీలర్ శ్రీనివాస్‌బాబు, దిలీప్, కుమార్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌పీ గ్యాస్ వినియోగదారుల సౌకర్యం కోసం గ్యాస్ ఏఈఆర్‌బీ షాపీ పాయింట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీంతో ఈ ప్రాంతంలో పరిశ్రమలలో పనిచేసే కార్మికులు ఎక్కువగా ఉండటంతో వారికి కావాల్సిన గ్యాస్ సిలిండర్లు, ఇతర ఉత్పత్తులు వినియోగదారులు ఈ పాయింట్ వద్ద బుక్ చేసుకొని తీసుకెళ్లటం, కొత్త కనెక్షన్‌ల కోసం దరఖాస్తులు చేసుకోవటం లాంటి వాటికి ఈ కేంద్రం అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ పాయింట్‌లో ప్రజలకు అవసరమైన రెండు కేజీలు, 5 కేజీ, 19 కేజీల గ్యాస్ సిలిండర్‌లు అందుబాటులో ఉంచటంతో పాటు గ్యాస్‌కు సంబంధించిన ఇతర ఉత్పత్తులు ఉంటాయని చెప్పారు. వీటిని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏజెన్సీ సభ్యులు కిరణ్, ఇస్మాయిల్, అఖిల్ తదితరులు ఉన్నారు.



గ్యాస్ ఏఆర్‌బీ షాపీ పాయింట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బాధితులకు న్యాయం చేయాలి

ఏసీఎఫ్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బేగరి యాదయ్య

షాబాద్: పరిశ్రమల పేరుతో చందనవెల్లి గ్రామంలో భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని ఏసీఎఫ్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బేగరి యాదయ్య కోరారు. శనివారం నగరంలో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి చందనవెల్లి గ్రామంలో సర్వే నంబర్ 190లో 1200 వందల ఎకరాల భూమిని గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల నుంచి తీసుకుంది. అప్పట్లో ఎకరాకు రూ.9లక్షలు నష్టపరిహారం కొంత మందికే చెల్లించారు. మిగతా రైతులకు జరిగిన అక్రమాలపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రైతులకు సరైన నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు తమకు అనుకూలంగా ఉన్నవారి పేర్లు, అసలు భూమి లేనివారి పేర్లు రాసి నష్టపరిహారం డబ్బులు ఇప్పించారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోసుకోవాలని కోరారు. సీతారాంపూర్ గ్రామంలో దేవాదాయశాఖకు సంబంధించిన భూమిని కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారంతో పాటు 150 గజాల ప్లాట్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అదే విధంగా చందనవెల్లి గ్రామంలో భూములు కోల్పోయిన రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించి 200 గజాల ప్లాటు ఇప్పించాలని కోరారు. మంత్రి వెంటనే స్పందించి మాట్లాడుతూ.. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందే విధంగా తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వడ్డే మహేందర్, బుర్గుల మల్లేశ్‌గౌడ్, సత్తయ్య తదితరులున్నారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న యాదయ్య తదితరులు

బీజేపీకే ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు



సమావేశంలో పాల్గొన్న ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణపై సానుకూలంగా ముందడుగు వేసిన బీజేపీ పక్షానే ఎమ్మార్పీఎస్ ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను ఎండగట్టాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.నర్సింహ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్‌రావు మాదిగలు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో జరుగుతున్న న్యాయమైన పోరాటం ఉద్యమం విజయతీరాలకు చేరుకుందన్నారు. ప్రధాని మోదీ చొరవతో సుప్రీంకోర్టు వర్గీకరణపై 3 రోజుల విచారణలో సానుకూలమైన తీర్పు వస్తుందనే నమ్మకం ఉందన్నారు. అందుకే వర్గీకరణకు అనుకూలంగా ఉన్న బీజేపీకే ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం మాదిగ, మాదిగ ఉపకులాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేసేందుకు ఎమ్మార్పీఎస్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రచార కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కమిటీ ఇన్‌చార్జిగా క్యాసారం శంకర్‌రావు మాదిగ, కో-ఇన్‌చార్జిలుగా ప్రవీణ్‌కుమార్, శంకర్, భానుప్రసాద్‌లు, సభ్యులుగా శ్రీనివాస్, వెంకటయ్య, ప్రవీణ్, మహేందర్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు శివప్రసాద్, లక్ష్మయ్య, నర్సింలు, మహేందర్, చందు, నరేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డంతా జలమయం!

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామం 1వ వార్డు కాలనీలో మంచినీటి పైపులైన్ పగలడంతో రోడ్డంతా జలమయం అవుతోంది. వారం రోజులుగా ఈ పైపులైన్ పగిలి నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఇటు ఇళ్ల మధ్యన, రోడ్డుపై వరదనీటితో రోడ్డుపై వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆ కాలనీ వాసులు ఆరోపించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగిలిన పైపులైన్‌లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. పైపులైన్ పగిలిన విషయమై పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిని వివరణ అడగగా.. పైపులైన్ పగలడం నిజమే, త్వరలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.



పైపులైన్ పగలడంతో వృథాగా పోతున్న నీరు

‘మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు’

షాద్‌నగర్‌రూరల్: మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అభివృద్ధి కోసమే ఆలోచించారు తప్పా ఎవరికీ అన్యాయం చేయలేదని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీనగర్‌కాలనీలో గల బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే తన పదవీ కాలంలో ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా అభివృద్ధి పనులను చేపట్టారని తెలిపారు. కొత్తూరు నుంచి షాద్‌నగర్ వై జంక్షన్ వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులకు రూ.112.75కోట్లను మంజూరు చేయించారన్నారు. రోడ్డు వెడల్పులో ప్రజల ఇళ్లకు, వారి వ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పనులు చేశారన్నారు. గత ప్రభుత్వం ప్రజల ఆస్తులకు భంగం కలిగిస్తూ రోడ్డు విస్తరణ పనులను చేపట్టిందని కొందరు నాయకులు మాట్లాడటం సరికాదని విమర్శించారు. ఎన్నికల కోడ్‌తో కాంట్రాక్టర్‌కు బిల్లులు ఆలస్యమయ్యాయన్నారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డు పనులు చేపట్టినప్పుడు ఎవరికీ ఇబ్బంది రాకుండా ఒక్క ఇల్లు కూల్చకుండా అందరి సమ్మతితోనే రోడ్డు పనులను పూర్తి చేశామని వివరించారు. అభివృద్ధి కోసమే ఆలోచించే మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌పై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్.నటరాజ్, కౌన్సిలర్లు జీటీ.శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు ఒగ్గకిశోర్, నాయకులు చీపిరిరవియాదవ్, సలీం, రాఘవేందర్‌గౌడ్, శీలంశ్రీకాంత్, అశోక్, విజయ్, హన్మంత్ పాల్గొన్నారు.